

పథకాలతో ఆర్థికంగా ఎదగాలి

ప్రతీ మహిళ ఏదో ఒక ప్రభుత్వ పథకంతో లబ్ధి పొంది ఆర్థికంగా ఎదగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వివరాలు 8లో ▸



ఆశాజనకంగా కంది పంట

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో కంది పంట ఆశాజనకంగా ఉంది.

వివరాలు 9లో ▸



కార్మికులపై వేధింపులు ఆపాలి

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి జట్టుకు రాయికోడ్ విద్యార్థి


విద్యార్థి హన్మంతు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి హన్మంతు జాతీయ స్థాయి అండర్ 14 వాలీబాల్ జట్టుకు ఎంపిక అయినట్టు మండల విద్యాధికారి వి.అంజయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి ఎంపిక, ఆటలో మెలకువలు నేర్పిన ఫిజికల్ డైరెక్టర్ జ్యోతిని సన్మానించారు. వచ్చే నెలలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్ 14 వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి హన్మంతును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖైరత్ అలీ, వినోద, అనంత్‌రావ్, కోటీశ్వర్,వేణు, శ్రావణ్‌కుమార్, సునంద, శోభారాణి, నాగరాణి, శివలక్ష్మి, ప్రతిభ పాల్గొన్నారు.

ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర


మాట్లాడుతున్న భవాని చంద్ర

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంతో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రిమినల్, ఎక్సైజ్‌కు సంబంధించిన కేసులను రాజీమార్గాన కక్షిదారులతో మాట్లాడి తొందరగా కేసులను పరిష్కరించాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ వారిగా ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించి కక్షిదారులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. సివిల్ , కుటుంబ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారించాలని చెప్పారు. డిసెంబర్ 14న నిర్వహించే జాతీయా లోక్ అదాలత్ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి జయంతి, మూడవ అదనపు జిల్లా జడ్జి సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

సంగారెడ్డి: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజూ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. నేడు వారోత్సవాల ముగింపు పురస్కరించుకొని వారం రోజుల పాటు వివిధ అంశాల వారీగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందజేస్తామని గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వసుంధర, డిప్యూటీ గ్రంథపాలకులు వంశీకృష్ణ, సహాయ గ్రంథపాలకులు ఆర్.శ్రీనివాస్, ప్రశాంత్‌కుమార్, సిబ్బంది వరలక్ష్మి, సావిత్రి, మంజుల, కష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ధనసిరి విద్యార్థి ఎంపిక


తయారుచేసిన యంత్రంతో విద్యార్థి

జహీరాబాద్ టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించనున్న ఇన్‌స్పైయిర్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మొగుడంపల్లి మండల ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మల్లికార్జున్ రూపొందించి కలుపుతీత యంత్రం నమూనా ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేశ్‌కుమార్ తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను 21 నుంచి 23 వరకు సంగారెడ్డిలో ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన ఉందన్నారు. ఈ మేరకు హెచ్‌ఎం రమేశ్ కుమార్, ఉపాధ్యాయులు మల్లయ్య స్వామి, చంద్రశేఖర్, శామయ్య, పరమేశ్వర్, సిద్ధప్ప, మంజుల, మహేశ్ విద్యార్థిని అభినందించారు.

ఆ అధికారులనూ వదలం

- త్వరలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం
- పార్కులు, రోడ్ల పరిరక్షణ బాధ్యత మాదే
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ
- అమీన్‌పూర్ పెద్ద చెరువు సందర్శన


అమీన్‌పూర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు: అక్రమాలకు కారకులైన అప్పటి అధికారులపై కూడా చర్యలు ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్ద చెరువు భూభాగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే అక్రమ నిర్మాణాలను కూలిచ్చివేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నలుమూలలలో ప్రభుత్వ, చెరువు భూములతో పాటు లేఔట్‌లోని పార్కులు రోడ్ల పరిరక్షణ బాధ్యత కూడా తమదేనని చెప్పారు. అయితే కోర్టు సూచనల మేరకే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు శిఖం విస్తీర్ణంలో స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. చెరువు అలుగులు, తూములు మూసి వేయడంతో చెరువులోకి వస్తున్న నీరు బయటకు పోవడం లేదని, దాంతో శిఖం విస్తీర్ణం 400 ఎకరాలకు విస్తరించిందని తమకు ఫిర్యాదు వచ్చిందన్నారు. అమీన్‌పూర్ చెరువులో నీరు బయటకు వదలకపోవడంతో తమకున్న ప్లాట్లు నీళ్లలో మునిగాయని, ప్లాట్ల యజమానులు తమకు ఫిర్యాదు చేశారని రంగనాథ్ వివరించారు.

అలాగే అమీన్‌పూర్ పెద్ద చెరువు పైభాగంలోని వెంకటరమణా కాలనీ పద్మావతి లేఔట్లను పరిశీలించారు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. పద్మావతి లేఅవుట్‌కు చెందిన భూమిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమించారనే ఆరోపణలు రావడంతో ఆయన భూములను కమిషనర్ పరిశీలించారు. ప్లాట్ ఓనర్లతో పలు వివరాలు సేకరించారు. లేఔట్‌తో పాటు రాంభూపాల్ రెడ్డికి చెందిన భూముల సర్వేకు రంగనాథ్ ఆదేశించారు. ఇదిలా ఉండగా వెంకటరమణ కాలనీకి సంబంధించిన పార్కు స్థలం గోల్డ్‌కి అనే సంస్థ కబ్జా చేసి అపార్ట్‌మెంట్ కడుతోందన్న అంశంపై రంగనాథ్ స్పందించారు. వెంకటరమణ పార్కు స్థలం కబ్జాను తేల్చే సర్వే పని పూర్తయిందని, నివేదిక రాగానే చర్యలకు ఉపక్రమిస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు. అమీన్‌పూర్ పరిధిలోని శంభుని కుంట చెరువు కూడా ఆక్రమణ గురైందని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ నలుమూలల నుంచి కూడా ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అమీన్‌పూర్ పరిధి నుంచి కాలనీ సంఘాల వారు ఎక్కువ ఫిర్యాదులతో తన వద్దకు వస్తున్నారని రంగనాథ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కమిషనర్ రంగనాథ్ పర్యటనలో స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం.

ప్రతిభకు పురస్కారం

జడల చంద్రమ్మ, దీపికరెడ్డిలకు ఇందిరాగాంధీ అవార్డు అందజేత



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న దీపికరెడ్డి, చంద్రమ్మ

ఝరాసంగం(జహీరాబాద్)/జోగిపేట(అందోల్): జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా రైతులకు ఇందిరా గాంధీ ప్రతిభ పురస్కార అవార్డు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వ విజయోత్సవాల సందర్భంగా వ్యవసాయంలో విశేష సేవలు అందిస్తున్న వారికి ఈ పురస్కారాలను అందజేసింది. ఝరాసంగం మండల పరిధిలోని బిడె కన్నె గ్రామానికి చెందిన రైతు జడల చంద్రమ్మ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో చిరుధాన్య పంటలను సాగు చేస్తుండటంతో ఈ అవార్డుకు ఎంపికైంది. అలాగే.. సమగ్ర వ్యవసాయ రంగంలో విశిష్ట కృషి చేస్తున్న జోగిపేటకు చెందిన మహిళా రైతు దీపిక కూడా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో వీరిద్దరికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అవార్డు అందించారు.

కలెక్టర్‌కు నోటీసులు

బొల్లారం కమిషనర్‌కు కూడా..

జిన్నారం(పటాన్‌చెరు): జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ నుంచి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి, బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారుకు నోటీసులు వచ్చాయి. ఇటీవల బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సఫ్య కర్మచారి నర్సింహ విధినిర్వహణలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరికి నోటీసులు జారీ అయ్యాయి. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నోటీసులో కమిషన్ కార్యదర్శి రాహుల్ కశ్యప్ సూచించారు. ఎస్సీ ఎస్టీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. కార్మికుడి మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మృతి చెందిన కార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని పేర్కొన్నారు. సోషల్ వర్కర్ షాబుద్దీన్ అనే వ్యక్తి కమిషన్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి.


సంగారెడ్డిలో దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- దివ్యాంగుల క్రీడా పోటీలు ప్రారంభం


కాలుతో క్యారం బోర్డు ఆడుతున్న దివ్యాంగులు

సంగారెడ్డి జోన్: వైకల్యం శరీరానికి మాత్రమే అవుతుంది.. మనసుకు కాదు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే దివ్యాంగులూ అద్భుత విజయాలను సాధించగలరని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. దివ్యాంగుల క్రీడల ప్రాముఖ్యత, స్ఫూర్తిదాయకమైన విజయాల గురుంచి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి ఒక్కరికి చదువు అత్యంత కీలకం అన్నారు. చదువుతోనే మనం మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఐఏఎస్ శిక్షణ సమయంలో తన బ్యాచ్‌మేట్ అజయ్ అరోరా గురించి ఆమె ప్రస్తావిస్తూ, ఆయన పూర్తిగా అంధుడు, తన పట్టుదలతో ఐఏఎస్ సాధించి, ప్రస్తుతం రాజస్థాన్ క్యాడర్‌లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. చదువులో మంచి స్థాయిని సాధించి జీవితంలో ముందుకు వెళ్లాలని, మీ ప్రయత్నం మీ కుటుంబానికి, సమాజానికి గర్వకారణం కావాలని, ఉన్నత శిఖరాలు అందుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కాగా, దివ్యాంగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. సోలార్ సొసైటీని స్థాపించి, తానే ఆదాయం పొందడమే కాకుండా, ఇతరులకు ఉపాధి కల్పించడం ద్వారా అందరికి ఆదర్శంగా నిలిచారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, యువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసీంబేగ్, దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులు సాయికుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరిచేలా ప్రదర్శనలు


ప్రజా పాలన కళాజాత ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, తదితరులు

సంగారెడ్డి జోన్: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను చైతన్య పరిచే విధంగా కళాజాత ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు సందర్భంగా తెలంగాణ సాంస్కృత సారధి కళాయాత్ర కార్యక్రమాలను జిల్లాలో ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌర సంబంధాల శాఖ, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి డిసెంబరు 7వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజా పాలన కళాయాత్ర వాహనాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంస్కృతిక సారధి కళాబృందాలు ప్రతిరోజు మూడు గ్రామాలలో ఆటపాటలు నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేరువ చేసే విధంగా కళా ప్రదర్శనలు జరగాలన్నారు. కార్యక్రమాలను మండల ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలసత్వం వహిస్తే సంబధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజా రాణి, డీపీఆర్‌ఓ ఏడుకొండలు తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో నిర్లక్ష్యం వద్దు


నారాయణఖేడ్: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- గురుకుల పాఠశాల తనిఖీ

నారాయణఖేడ్: విద్యార్థులకు విద్యాబోధనతో పాటు వసతి, భోజన విషయాల్లో నిర్లక్ష్యం వహించకూడదని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం నిజాంపేట మండలం బాచేపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో శుభ్రత, కూరగాయలు, సరకులను పరిశీలించారు. విద్యాబోధన, భోజన, వసతి, తాగునీరు తదితర సదుపాయాలను గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి విద్యార్థినిలను గణిత శాస్త్రంకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పడంతో వారిని మెచ్చుకున్నారు. కాగా, సిర్గాపూర్ మండలం బొక్కస్ గ్రామానికి చెందిన జ్ఞానోబారావు, కమ్మరి బ్రహ్మయ్యలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను నారాయణఖేడ్‌లోని తన నివాస గృహంలో అందజేశారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, నాయకులైన శంకర్ గౌడ్, యాదవరెడ్డి, పండరిరెడ్డి, రాధాకిషన్, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

శారీరక శ్రమతో డయాబెటీస్‌కు చెక్

- ట్రైనీ కలెక్టర్ మనోజ్
- జోగిపేటలో డయాబెటీస్ అవగాహన కరపత్రాల ఆవిష్కరణ


జోగిపేటలో డయాబెటీస్ అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

జోగిపేట(అందోలు): శారీరక శ్రమతో డయాబెటీస్ దరిదాపుల్లోకి కూడా రాదని, యువత డయాబెటిస్ వ్యాధి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్ సూచించారు. జోగిపేటలోని ఎంపీపీ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న డయాబెటీస్ వీక్ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ ఆకుల రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మధుమేహం గురించి లయన్స్‌క్లబ్ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. మనిషికి డయాబెటిస్ వ్యాధితోనే అన్ని వ్యాధులు వస్తాయన్నారు. సమయానుకూలంగా ఆహారం తీసుకోవాలన్నారు. 35 నుంచి 40 ఏళ్ల యువతకు గుండె జబ్బులు, ఇతర వ్యాధులు రావడానికి డయాబెటీస్ వ్యాధియే కారణమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా డయాబెటీస్ కార్యదర్శి డాక్టర్ కె.అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.జగన్ మోహన్ రెడ్డి, రాంబాబు, జోన్ చైర్మన్ రామకృష్ణ, ఎంపీఓ అశోక్, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లే శ్రీకాంత్, జీఆర్ మధుసూదన్ రెడ్డి, కోశాధికారి జి.సంతోష్, సభ్యులు ఆర్.ప్రదీప్‌గౌడ్, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలో నెలకొన్న భూ వివాద సమస్యను ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సర్వే నంబర్ 166లో భూములను పర్యవేక్షించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, మాజీ సర్పంచ్ ప్రకాశం చారి పాల్గొన్నారు.

తాగునీటికి విల'విల్లా'!

రూ. కోట్లు వెచ్చించి విల్లాలు కొన్నా తప్పని ఇక్కట్లు ● గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసుల నిత్య గోస

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లు శని అన్న చందంగా ఉంది గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసుల పరిస్థితి. కోట్ల రూపాయలు వెచ్చించి విల్లాలు కొన్నామన్న సంతృప్తి కన్నా.. గుక్కెడు తాగు నీరందడం లేదన్న వెలితి నిత్యం వెంటాడుతోంది. తమ విల్లాలకు సకల వసతులున్నా.. కనీస అవసరమైనా తాగునీటి సౌకర్యం కరువైంది. దీంతో వారు పడుతున్న ఇబ్బందులు వర్ణానాతీతం. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ వాసులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి విల్లాలు కొనుగోలు చేసిన వీరికి మాత్రం తాగునీటి సరఫరా లేక అనేక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉస్మాన్‌నగర్‌లో భూమిని కేటాయించింది. 40 లక్షల లీటర్ల సామర్థ్యంగల సంపు, 20 లక్షల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం , 22 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం కోసం సుమారు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు 2022 నవంబరు 10న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాన చేశారు. కానీ రెండేళ్లు గడిచినా ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 60 గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. ఈ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కాలనీలో ఉన్న బోరు నీటినే వారు వినియోగించుకుంటున్నారు, కాగా, సంపు పనులను పూర్తిచేసి కొద్ది రోజుల క్రితం ట్రయల్ రన్ నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా 20 లక్షల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడానికి మూడు నెలలు పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే గానీ గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసుల నీటి గోస తప్పేటట్లు లేదు.


నత్తనడకన సాగుతున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు

వేగవంతంగా పనులు

త్వరలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులకు తాగునీటిని సరఫరా చేస్తాం. సంపు పనులు పూర్తి చేశాం. పక్షం రోజుల క్రితమే ట్రయల్ రన్ నిర్వహించాం. దీని ద్వారా పలు కమ్యూనిటీ కాలనీలకు త్వరలో నీటిని అందిస్తాం, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను సైతం త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం.

చంద్రశేఖర్, డీజీఎం, వాటర్‌వర్క్స్

తాగునీటి సమస్యతో సతమతం



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న సంపు, ఓవర్‌హెడ్ నిర్మాణం పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఈ విషయంపై రెండురోజుల క్రితమే సంబంధిత అధికారులను కలిశాం.

ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

పన్నులు కడుతున్నా దిక్కులేదు



ప్రభుత్వానికి సకాలంలో పన్నులు కడుతున్నా తమకు తాగునీటిని అందించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. అనేక గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

రామ్‌కుమార్, సన్నియా హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీ అధ్యక్షుడు

క్లుప్తంగా

'సాదత్ అలీ'కి టీచర్స్ ఇన్‌స్పిరేషన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం సాదత్ అలీ

దుబ్బాక: శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థలో వినూత్నమైన పాత్రను పోషించే ఉపాధ్యాయులకు ఇచ్చే టీచర్స్ ఇన్‌స్పిరేషన్ 2024 అవార్డును దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు సాదత్ అలీ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్ కుమార్ చేతుల మీదుగా ప్రధానం చేయడంతోపాటు ఘనంగా సత్కరించారు. సాదత్ అలీ పదేళ్లుగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక అవార్డులను పొందారు. ప్రస్తుతం సాదత్ అలీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. అవార్డు రావడంపై ఎంఈఓ ప్రభుదాసు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు



వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువు మరో వారం రోజులు పొడిగించారు. గడువు తేదీ మంగళవారం ముగియాల్సి ఉండగా, 26 వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీ చేసిందని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోక్సో కేసులో ఏడేళ్ల జైలు

రూ.20 వేలు జరిమానా

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్షతోపాటు జరిమానా పడినట్లు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మెదక్ పట్టణానికి చెందిన ఓ మైనర్ విద్యార్థిపై నిందితుడైన ఆమె మేనమామ(అమ్మ సోదరుడు) ఒగ్గు శ్రీనివాస్ ఏడాది కాలంగా అఘాయిత్యానికి పాల్పడినట్లు తేలిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇటీవల కేసు నమోదు చేసి నిందితుడైన శ్రీనివాస్‌ను కోర్టుకు హాజరు పర్చగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బంది జిల్లా ఎస్పీ అభినందించారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ ఘటన అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముత్తినేని వెంకటేశ్వరరావు, మాధవరావు ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరిద్దరి మధ్య కొద్ది రోజులుగా భూ తగాద కొనసాగుతుంది. రెండ్రోజుల కిందట వెంకటేశ్వరరావు వ్యవసాయ పొలం వద్ద పని చేస్తుండగా మాధవరావు అతడి భార్య, కుమారుడు కలిసి దాడి చేసినట్లు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విదేశీయుల వివరాలు నమోదు చేయాలి

హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్‌లకు సీపీ హెచ్చరిక

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్‌లలో బస చేయడానికి వచ్చే విదేశీయుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. విదేశీయుల పూర్తి వివరాలు, వారు ఎక్కడి నుంచి, ఎందుకొచ్చారు అనే వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు చేయని నిర్వాహకులపై 1946 విదేశీయుల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

పథకాలతో ఆర్థికంగా ఎదగాలి

- త్వరలో విదేశీ జాబ్ కోసం మహిళలకు ప్రత్యేక క్యాంప్
- మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌కు త్వరలో 50 సెట్విన్ ఆటోలు : ఛైర్మన్ గిరిధర్ రెడ్డి
- సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రం ప్రారంభం


హుస్నాబాద్‌లో సెట్విన్ శిక్షణా కేంద్రంలో కుట్టు మిషన్‌తో మంత్రి పొన్నం, తదితరులు

హుస్నాబాద్: ప్రతీ మహిళ ఏదో ఒక ప్రభుత్వ పథకంతో లబ్ధి పొంది ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్‌లో సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సెట్విన్ శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్, బ్యూటిషన్, కంప్యూటర్ ల్యాబ్, ఐటీఐ మెకానిక్స్ ఎంఎస్ అకౌంటెంట్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. మహిళలు ఇంట్లోనే కూర్చొని ఆదాయం పెంచుకోవడానికి వివిధ రకాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసుకోవడానికి అధికారికంగా టామ్ కామ్ కంపెనీ ద్వారా త్వరలో క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు ట్యాక్స్ లేకుండా చూశామని, సోమవారం ఒక్కరోజే 113 ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్ అయ్యాయని తెలిపారు.

కళాయాత్ర వాహనాల ప్రారంభం..

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాయాత్ర వాహనాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను డిసెంబర్ 7 వరకు గ్రామ గ్రామాన ప్రచారం చేయడానికి ప్రభుత్వ పక్షాన 33 జిల్లాల్లో ఇలాంటి వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఇందిరా గాంధీ విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.

నైపుణ్యం పెంచడానికి శిక్షణ కేంద్రం

యువతకు నైపుణ్యం పెంచడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి అన్నారు. జంట నగరాల్లోనే కాకుండా తెలంగాణలో కూడా సెట్విన్ కేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 23 శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, మరో 5 కేంద్రాలు రాబోతున్నాయని తెలిపారు. త్వరలో జహీరాబాద్, హుస్నాబాద్‌కు 50 చొప్పున సెట్విన్ ఆటోలను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ మోహన్ రెడ్డి, సెట్విన్ ఎండీ వేణు గోపాల్, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిత్ర లేఖనం, కథల పోటీల్లో ప్రతిభ


పతకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్ర లేఖన, కథల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తెలుగు రాష్ట్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థి శ్రీనిధి చిత్రలేఖనలో, 8వ తరగతి విద్యార్థి దీక్షిత కథల పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరికి ప్రశంసాపత్రంతోపాటు నగదు పారితోషకాన్ని నిర్వాహకులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు జగదీశ్వర్‌ను హెచ్‌ఎం మానువాడ సరళ అభినందించారు.

ఆర్ట్ పోటీల్లో విద్యార్థుల సత్తా

వెల్దుర్తి(తూప్రాన్): రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆర్ట్ కాంపిటేషన్ ముంబయి నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్ట్ కాంపిటేషన్‌లో వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ చాటారు. పోటీల్లో పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొనగా, వివిధ కేటగిరీలో ఎనిమిది గోల్డ్ మెడల్స్, ఐదు సిల్వర్, ఐదు మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం సాంబయ్య పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు విద్యార్థులకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు జయసుధను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, నర్సింహారెడ్డి, చార్లెస్, అర్చన, నవనీత, అమూల్య, సునీత, శైలజ, వాణిశ్రీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు..

గజ్వేల్‌రూరల్: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన విద్యార్థిని పవిత్ర ఎంపికై నట్లు ఆ పాఠశాల పీడీ ప్రశాంత్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థిని ఇటీవల చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన ఆటతీరును కనబర్చిందన్నారు. డిసెంబర్ 10న ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగనున్న అండర్-14 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కరీమొద్దీన్‌తో పాటు ఉపాధ్యాయులు పవిత్రను అభినందించారు.

అదృశ్యమై.. పత్తి చేనులో శవమై

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య


బక్కప్ప (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి నాలుగు రోజుల తర్వాత పత్తి చేనులో శవమై తేలాడు. ఈ ఘటన మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. చేవెళ్ల గ్రామానికి చెందిన బక్కప్ప (38) 15న భార్యతో గొడవపడి రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు చుట్టుపక్కల గ్రామాలతోపాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశాం. గ్రామ శివారులోని సంతోష్ అనే వ్యక్తి పత్తి చేనులో మంగళవారం కూలీలు పత్తి ఏరడానికి వెళ్లగా బక్కప్ప మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబీకులకు తెలియజేశారు. భార్య రుక్మిణి వేధించడం, తరచూ గొడవ పడుతూ తల్లిగారింటికి వెళ్లి పోతుందని సూసైడ్ నోట్ జేబులో దొరికింది. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు అనుమానం ఉందని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. అదృశ్యం కేసును ఆత్మహత్య కేసుగా నమోదు చేశామన్నారు.

పురుగుల మందు తాగి రైతు

గజ్వేల్‌రూరల్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని జాలిగామలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎక్కాల స్వామి(43)కి భార్య కనకవ్వ దంపతులు తమకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురైన స్వామి మద్యానికి బానిసయ్యాడు. దంపతుల మధ్య గొడవ జరగడంతో కనకవ్వ అత్తామామల వద్ద ఉంటుంది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

గృహిణి ఆత్మహత్య కేసులో..

యువకుడి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న ఎస్‌ఐ

మర్కూక్(గజ్వేల్): వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకోగా, అందుకు కారణమైన యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ప్రియాంక(24) అదే గ్రామానికి చెందిన కుంట భాస్కర్ మానసికంగా వేధిస్తున్నాడని పది రోజుల కిందట ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న భాస్కర్‌ను ఎస్‌ఐ దామోదర్ తన బృందంతో కలిసి ఎర్రవల్లిలోని అతడి నివాసంలో అదుపులోకి తీసుకొని గజ్వేల్ కోర్టులో హాజరు పర్చారు.

జనగణనలోనే కులగణన చేపట్టాలి : నందగోపాల్

మెదక్ మున్సిపాలిటీ: జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ నందగోపాల్ డిమాండ్ చేశారు. 25న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే సమరభేరి పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించేందుకు బీసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, రక్షక దళ చైర్మన్ ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

తొగుట(దుబ్బాక): మండలం లక్ష్మాపూర్‌కు చెందిన పిట్ల రాజుపై జరిగిన హత్యాయత్నం ఘటనలో మరో ఇద్దరిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మాసాన్‌పల్లి మదిర ఇందిరానగర్‌కు చెందిన కదారి సాగర్‌తోపాటు మరొకరిని సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం హైదరాబాద్‌లో పట్టుకొని విచారిస్తున్నట్టు సమాచారం. 11వ తేదీన రాజుపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో శనివారం ఆరుగురిని అరెస్టు చేసి రిమాండుకు పంపించిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెల్మ స్వామితోపాటు రాంపురానికి చెందిన జంగిటి భిక్షపతి పరారీలో ఉన్నారు.

వరి కోత మిషన్ దగ్ధం


మంటల్లో కాలిపోతున్న మిషన్

వర్గల్(గజ్వేల్): వరి కోస్తుండగా పొలంలో విద్యుత్ తీగలు తగిలి వరి కోత మిషన్ దగ్ధమైంది. ఈ ఘటన వర్గల్ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. వేలూరుకు చెందిన రైతు ఉప్పరి రామస్వామి మంగళవారం తమ గ్రామంలోని రాయన్న శ్రీశైలానికి చెందిన వరికోత మిషన్‌తో పంట కోయిస్తున్నాడు. పొలంలో వేలాడుతున్న కరెంటు తీగలను డ్రైవర్ గమనించకుండా ముందుకు నడిపించడంతో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. భారీగా మంటలు వ్యాపించి మిషన్ పూర్తిగా దగ్ధమై భారీ నష్టం వాటిల్లింది. కళ్లెదుటే యంత్రం బుగ్గిపాలు కావడంతో యజమాని శ్రీశైలం బోరుమన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


ప్రభాకర్(ఫైల్)


మహేశ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి ఫరీద్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామానికి చెందిన శీల ప్రభాకర్(25), మామిండ్ల మహేశ్(26) మంగళవారం రాత్రి పని నిమిత్తం మెదక్‌కు వచ్చారు. రాత్రి తిరిగి స్వగ్రామం జక్కన్నపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో ఫరీద్‌పూర్ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందగా, మహేశ్‌ను మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని హవేళిఘణాపూర్ ఏఎస్‌ఐ రాజు తెలిపారు.

బైక్ పై నుంచి పడి మహిళ..

మర్కూక్(గజ్వేల్): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి చెందారు. మృతురాలి బంధువులు, పోలీసుల కథనం మేరకు.. గణేశ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్ల పద్మావతి (49) కుమారుడు భాస్కర్‌తో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై గజ్వేల్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు పద్మావతి బైక్ పై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. మృతురాలి కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి అవయవాలను ఇతరులకు దానం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తూప్రాన్‌కు చెందిన నర్సింలు బైక్‌పై సోమవారం అర్ధరాత్రి మేడ్చల్ నుంచి తూప్రాన్‌కు వెళ్తున్నాడు. మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి శివారులోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఇదే సమయంలో మెదక్ నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్సం నిమిత్తం మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం తీవ్ర జాప్యం


ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

మాట్లాడుతున్న గోవిందు నరేశ్

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ అంశంలో జాప్యం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని కోలా అభిరామ్ గార్డెన్స్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట స్వామి మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి మాదిగలతో కలిసి గోవిందు నరేశ్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ముప్పై ఏళ్లపాటు అలుపెరగని పోరాటం చేసి సుప్రీంకోర్టు ద్వారా విజయం సాధిస్తే.. ఆ ఫలాలు మాదిగలకు అందకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో దేశంలో తమ ప్రభుత్వమే ముందుగా అమలు చేస్తుందని అసెంబ్లీలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విస్మరించారని ఆరోపించారు. 11,062 టీచర్ పోస్టుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన హర్యానా ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతిమంగా న్యాయమే గెలుస్తుందని, మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పరుశరాములు, నాయకులు యాదగిరి, మైసరాములు, యాదగిరి, శ్రీనివాస్, రమేశ్, పవన్‌కల్యాణ్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు సూచించిన మాత్రలే వాడాలి


వర్గల్(గజ్వేల్): వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్ కుమార్
- ములుగు, వర్గల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ

ములుగు(గజ్వేల్) : ప్రజలు వైద్యులు సూచించిన యాంటీబయాటిక్స్ మాత్రలనే తీసుకోవాలని, అనవసరమైన మందులు వాడొద్దని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ సూచించారు. మంగళవారం ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్తపరీక్ష నమూనాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందికి, ప్రజలందరికి వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వర్క్‌షాపు, ప్రతిజ్ఞ చేయించడం, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ గురించి చర్చ, పాఠశాలలు, కళాశాలల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెల 25కు తగ్గకుండా సాధారణ ప్రసవాలు నిర్వహించడంతోపాటు ఐపీ, ఓపీ సంఖ్యను పెంచాలని, తల్లి, బిడ్డల సంక్షేమ కార్యక్రమాల పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగించే మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ వైద్యాధికారి దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చూడండి

వర్గల్(గజ్వేల్): ప్రభుత్వాసుపత్రులల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ల్యాబ్, ఫార్మసీ రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 'యాంటీబయాటిక్' మందులను అనవసరంగా వాడకూడదని, ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరగాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆసుపత్రి కొత్త భవన నిర్మాణపనుల పురోగతి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ మేరీ మీనాకుమారి, డాక్టర్ శిరీష, సీహెచ్‌ఓ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ప్రాథమిక హక్కులు వర్తిస్తాయి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వాతిరెడ్డి

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తల్లిగర్భం నుంచే ప్రతీ ఒక్కరికి ప్రాథమిక హక్కులు వర్తిస్తాయని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సాయి రమాదేవీల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వాతిరెడ్డి హాజరై మాట్లాడారు. రాజ్యాంగం చాలా గొప్పదని అందరూ తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ఒక చట్టం అమలు కావాలంటే గవర్నమెంట్ నుంచి జీవోలు పాస్ అవ్వాలని చెప్పారు. 18 ఏళ్లలోపు ప్రేమించడం, ప్రేమించి పెళ్లి చేసుకోవడం తప్పన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు


విఠల్ చనిపోయాడని చూపుతున్న బాధితులు

నర్సాపూర్: చనిపోయిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన నర్సాపూర్‌లో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బాధితులు లంబాడి దేవీ సింగ్, మృతుని కుమారుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని 200 సర్వే నంబరులో తమ నలుగురి తాతల పేరు మీద మూడెకరాల ఐదు గుంటల భూమి ఉంది. ఇందులో ముగ్గురి తాతల పిల్లలు తమ వంతు వాటా అమ్ముకోగా, మేము మాత్రం విక్రయించలేదు. ఈ క్రమంలో తమ దాయాదుల వద్ద శ్రీనివాస్ అనే వ్యక్తి భూమిని కొనుగోలు చేశారు. మా తాతకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ భూమిని కొనుగోలు చేసిన శ్రీనివాస్‌కు పట్టా చేశారని, ఆ భూమిని నాలా కింద మార్పు చేశారని వాపోయారు. ఈ విషయంలో కొంత కాలంగా గొడవ జరుగుతుంది. దీనిలో భాగంగా శ్రీనివాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇందులో లంబాడి దేవిసింగ్‌తోపాటు తండ్రి సూర్య, అతడి చిన్నాన్న విఠల్(చనిపోయిన వ్యక్తి), విఠల్ కుమారుడు ఆంజనేయులుపై 23 సెప్టెంబర్ 2024లో నర్సాపూర్ ఎస్‌ఐ లింగం కేసు నమోదు చేశారు. కాగా విఠల్ 26-02-2018లోనే చనిపోయాడు. చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తమకు ఎఫ్ఐఆర్ కాపీ అందచేశారని దేవీసింగ్ ఆరోపించారు. ఆరేళ్ల కిందట చనిపోయిన విఠల్‌పై కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం: ఎస్‌ఐ లింగం

తమకు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అందులో ఉన్న అందరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశాం. కేసు విచారణ చేసిన అనంతరం చనిపోయిన వ్యక్తులు ఉంటే వారి పేర్లు తొలగించి గొడవకు బాధ్యులైన వారిని చార్జిషీట్‌లో చేరుస్తాం.